
సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 14 । మార్చి । 2025



దగ్గరకొచ్చారో దూకేస్తా..!
రిమ్స్‌లో ఓ రోగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సెక్యూరిటీ సిబ్బంది రక్షించారు.
- 8లో



ప్రత్యేకం.. పంచకర్మ వైద్యం
పంచకర్మ వైద్యం ప్రత్యేకంగా నిలుస్తోంది. సహజసిద్ధ ఔషధాలతో ఈ వైద్యం చేస్తారు.
- 8లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర (సా)	శని (ఉ)
6.08	4.48

న్యూస్‌రీల్

ఇన్విజిలేటర్‌కు దేహశుద్ధి

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో ఓ ఇన్విజిలేటర్‌కు దేహశుద్ధి జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటన బుధవారం సాయంత్రం జరగ్గా, గురువారం క్యాంపస్‌లో చర్చనీయాంశంగా మారింది. వర్సిటీలో.. న్యాయ విద్య ఎల్ఎల్‌బీ మూడేళ్లు, ఎల్ఎల్‌బీ ఐదేళ్ల పరీక్షలు 1, 3, 5 సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. బుధవారం శ్రీకాకుళానికి చెందిన ఓ విద్యార్థిని పరీక్షకు హాజరైంది. ఇన్విజిలేటర్‌గా వర్సిటీకి చెందిన గెస్ట్ ఫ్యాకల్టీ సభ్యుడు వ్యవహరించారు. అయితే పరీక్ష రాస్తున్న విద్యార్థిని ఫోన్ నంబర్‌ను అడిగి తీసుకున్న ఇన్విజిలేటర్ 'నువ్వంటే నాకిష్టం.. చూసి పరీక్ష రాసుకో.. నీకోసం రూం మొత్తం విడిచి పెడతా' అంటూ మెసేజ్‌పెట్టాడు. దీంతో ఆమె తన కుటుంబ సభ్యులకు ఈ మెసేజ్‌ను ఫార్వర్డ్ చేసి విషయం చెప్పి కాలేజీకి రావాలని సూచించింది. పరీక్ష సాయంత్రం ఐదు గంటలకు అయిపోయాక ఆమె ఇన్విజిలేటర్‌ను తన కుటుంబ సభ్యులకు చూపించింది. దీంతో నలుగురు వ్యక్తులు ఇన్విజిలేటర్‌పై దాడికి దిగారు. అక్కడ ఏం జరుగుతుందో.. ఎందుకు దాడి చేస్తున్నారో తెలీక విద్యార్థులంతా చూస్తూ ఉండిపోయారు. తర్వాత వారికి కూడా విషయం తెలిసింది. మెసేజ్ పెట్టిన వ్యక్తి క్షమాపణ చెప్పటంతో అతడిని విడిచిపెట్టారు. అయితే పరీక్ష కేంద్రంలోనికి సెల్‌ఫోన్‌ను అనుమతించడం వల్లే ఈ తంతు జరగడం వర్సిటీలో చర్చనీయాంశమైంది.

టీచర్‌పై ఫిర్యాదు

టెక్కలి రూరల్: మండలంలోని పెద్దసాన గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని వారి తల్లిదండ్రులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.నేతాజీకి బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఎంఈఓ దల్లి తులసిరావురెడ్డి ఉన్నతాధికారులకు తెలియజేశారు. డీఈఓ ఎస్. తిరుమల చైతన్య గురువారం సాయంత్రం పాఠశాలకు చేరుకుని విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు సేకరించారు. బాధిత విద్యార్థినుల తల్లిదండ్రులతో సైతం మాట్లాడారు.

కిడ్నీ వ్యాధులపై జాగ్రత్త



అవగాహన ర్యాలీ

శ్రీకాకుళం: కిడ్నీ సంబంధిత వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి వద్ద జరిగిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కిడ్నీ బాధితుల కోసం డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మరో ఐదు డయాలసిస్ యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. పలాసలో ఉన్న కిడ్నీ పరిశోధన కేంద్రం (ఆస్పత్రి)లో మెరుగైన సేవలు అందిస్తామన్నారు. కిడ్నీ వ్యాధిని త్వరగా గుర్తించేందుకు హార్వర్డ్, నార్త్ కెరోలీనా, కొలంబియా సెంటర్ ఫర్ సెల్యులర్ మాలిక్యులర్ బయాలజీ, ఐఏఎస్సీ బెంగళూరు యూనివర్సిటీలతో కలసి పరిశోధనలు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. కిడ్నీ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు మనిషి జీవన విధానంలో మార్పు రావాలన్నారు. ఎక్కువ నీరు తాగటం, వ్యాయామం చేయటం, ఒత్తిడికి గురికాకుండా ఉండటం, ఏటా పరీక్షలు చేయించుకోవటం వంటి పలు పద్ధతులను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్, డీసీహెచ్ డాక్టర్ కళ్యాణ్ బాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలమురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అహో అనాలి

దేవాలయాల్లో డోలోత్సవాలు.. సముద్ర తీరాల్లో పవిత్ర స్నానాలు.. వీధుల్లో హోలీ వేడుకలు.. కలగలిపి వసంతాగమనాన్ని రంగులు చల్లి చాటడానికి ఊరూవాడా సిద్ధమైంది. నిండు చంద్రుడి సాక్షిగా ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి ఘడియల్లో సంబరాలు జరుపుకోనుంది. గోగుపూల ఎర్ర రంగు, పసుపు కొమ్ముల ప్రత్యేక వర్ణాలు, ఎర్ర మందారాలతో సిందూర వర్ణాలను ఇంటిలోనే తయారు చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. రసాయనాలను ఒంటిపై పూసుకుని పండగను పాడు చేసుకోవద్దని సూచిస్తున్నారు.

- హోలీ వేడుకకు సర్వం సిద్ధం
- దేవాలయాల్లో డోలోత్సవాలు
- రసాయన రంగులు వద్దంటున్న నిపుణులు

ఇంటి వద్దే రంగుల తయారీ ఇలా..

- రక్తచందనం, ఎర్రమందారం, టమాటా, క్యారెట్‌లతో ఎర్రరంగు తయారు చేయవచ్చు.
- గోరింటాకుతో ఆకుపచ్చని రంగు తయారు చేయవచ్చు.
- పసుపు కొమ్ములను దంచి నీళ్లలో నానబెట్టి పసుపు రంగు చేసుకోవచ్చు.
- మోదుగపూలను నీటిలో నానబెట్టి రంగులను తయారు చేస్తారు.
- గోగుపూలతో బోలెడంత ఎర్రరంగు తయరు చేసుకోవచ్చు.



శ్రీకాకుళం కల్చరల్:

రంగుల వేడుకకు అంతా సిద్ధమైంది. ఇప్పటికే మార్కెట్‌ను రంగులు ముంచెత్తుతున్నాయి. మరోవైపు ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా వసంతోత్సవం పేరుతో స్వామికి డోలోత్సవాలు కూడా నిర్వహిస్తారు. దేశంలోనే ఏకైక దేవాలయమైన అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో డోలోత్సవాలు నిర్వహిస్తున్నారు. ముందురోజు కామదహనోత్సవం జరుపుతారు. అనంతరం పడియ సందర్భంగా సముద్రస్నానాలు ఆచరిస్తారు. ఈ సందర్భంగా ఉషా, ఛాయా, పద్మినీ సమేత శ్రీసూర్యనారాయణ స్వామి రోడ్డు పక్కనున్న డోలో మండపంలో ఉత్తర ముఖంగా భక్తులకు దర్శనమిస్తారు. భక్తులపైన వసంతం జల్లుతారు. శ్రీకూర్మంలో కూడా ఉత్సవం నిర్వహిస్తారు. శ్రీకాకుళంలోని ఉమా రుద్రకోటేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో స్వామి ఉత్సమూర్తులను డోలో మండపంలో ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తారు. జిల్లా కేంద్రంలో సుమా రు 150 కుటుంబా లు ఉన్న మార్వాడీలు ఒకే చోట చేరి హోలీ ఉత్సవాన్ని రాజస్థానీ మిలన్ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.





జాగ్రత్తలు తప్పనిసరి

- హోలీలో సహజమైన రంగులు మాత్రమే వాడాలి.
- రసాయన రంగులు వాడి ప్రమాదం తెచ్చుకోవద్దు.
- హోలీ రంగుల్లో ఉపయోగించే క్రోమియం, సీసం రసాయనాలు క్యాన్సర్ కారకాలు.
- రంగులు విపరీతంగా చల్లుకోవడం వల్ల గాలిలోకి రంగుల సూక్ష్మ కణాలు చేరుతాయి. దాని వల్ల మనకు తుమ్ములు, దగ్గు వచ్చి శ్వాశకోస సంబంధ ఇబ్బందులు వస్తాయి.
- రసాయన రంగులు కళ్లల్లో పడగానే కంటి చికాకు, ఎరుపు, నీరుకారడం, తాత్కాలిక అంధత్వం కలిగిస్తుంది. కళ్లలో పడకుండా జాగ్రత్త పడాలి.
- రంగుల వల్ల కొందరిలో ఎలర్జీ వస్తుంది. వారిని దూరంగా ఉంచాలి.
- హోలీ ఆడిన తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరచుకోవాలి.
- రసాయన రంగుల వలన అనుకోని ప్రమాదం జరిగితే వెంటనే వైద్యుని సంప్రదించాలి.

మూడు రోజులపాటు..



హిందూ సంప్రదాయంలో ఈ ఉత్సవాన్ని వసంతోత్సవం అని పిలుస్తారు. మూడు రోజుల పాటు జరుగుతుంది. మొదటి రోజు కామదహనోత్సవం, రెండో రోజు పడియా సందర్భంగా సముద్రస్నానాలు, మూడో రోజున స్వామిని తోటలోని డోలో మండపంలో ఉంచి ఊయలలో ఊపుతూ డోలోత్సవం నిర్వహిస్తాం.

– ఇప్పిలి శంకరశర్మ, ప్రధాన అర్చకులు, అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం

సహజ రంగులు వాడాలి



కళ్లకు, చర్మానికి ఎలాంటి ప్రమాదం రాకుండా సహజ రంగులు వాడాలి. రసాయన రంగులు కళ్లలో పడితే ఎర్రగా మారి నీళ్లు వస్తాయి. అలాగే చర్మ వ్యాధులు వస్తాయి. జాగ్రత్తలు పాటించాలి.

– ఎంఆర్‌కే దాస్, ఆప్తాలమిక్ అధికారి

ప్రశాంతంగా పండగ చేసుకోండి: ఎస్పీ



శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా ప్రజలు హోలీ పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచించారు. ఈ మేరకు గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. గొడవలు, అల్లర్ల జోలికి వెళ్లకుండా వేడుకలు జరుపుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో అసభ్యకరంగా ప్రవర్తించినా, ఆకతాయి చర్యలకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు. కలుషితమైన, ప్రమాదకరమైన రంగులు వినియోగించవద్దని పర్యావరణహితమైన రంగులు వాడాలని సూచించారు.



అరసవల్లిలో కామదహనోత్సవం (ఫైల్)



లెక్కలపై ప్రేమ

ప్రపంచ గణిత దినోత్సవాన్ని పొందూరు మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం వినూత్నంగా జరుపుకున్నారు. 'పై' ఆకృతిలో కూర్చుని గణిత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గణిత ఉపాధ్యాయులు పూజారి హరిప్రసన్న, ఇన్‌చార్జి హెచ్ఎం గోపాలశెట్టి సాయికుమార్‌లు గణిత దినోత్సవం విశిష్టతను వివరించారు.

- పొందూరు

పోర్ట్ నిర్వాసితులకు ప్లాట్ల కేటాయింపు

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ నిర్వాసితులకు ప్లాట్లను టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి లాటరీ ద్వారా గురువారం కేటాయించారు. మూలపేట, విష్ణు చక్రం గ్రామాలకు గాను నౌపడలో 58 ఎకరాల్లో 596 కుటుంబాలకు ప్లాట్లను కేటాయించారు. పోర్టు నిర్మాణంతో గ్రామాన్ని కోల్పోయిన విష్ణు చక్రం గ్రామస్తులకు ముందుగా 80 మందికి పునరావాస కాలనీలో పాట్లను కేటాయించారు. మరో రెండు నెలల్లో గ్రామాన్ని తరలించాల్సి వస్తుందని, అంతా సహకరించాలని కోరారు. అంతకు ముందు పునరావాస కాలనీలో భూమి పూజ చేశారు.

రేపటి నుంచి ఒంటి పూట బడులు


- ఏప్రిల్ 23 వరకు ఉదయం 7.45 నుంచి 12.30 వరకు తరగతులు
- టెన్త్ పరీక్షలున్న పాఠశాలల్లో మధ్యాహ్నం తరగతుల నిర్వహణ
- ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనం తిన్నాకే పిల్లలు ఇళ్లకు



శ్రీకాకుళం న్యూకాలనీ: ఒంటి పూట బడులకు వేళయ్యింది. పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు ఒకటో తరగతి నుంచి నుండి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు శనివారం నుంచి ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఒక్కపూట తరగతులను నిర్వహించనున్నారు. జిల్లాలో వసతి గృహాలు మినహా ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, మోడల్‌స్కూల్స్, ఎయిడెడ్, ప్రైవేట్‌పాఠశాలలు, గుర్తింపు పొందిన అన్‌ఎయిడెడ్ పాఠశాలల మేనేజ్‌మెంట్‌లలో ఒంటి పూట బడులు పక్కాగా అమలు కావాల్సిందేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈనెల 15వ తేదీ నుంచి ఈ విద్యా సంవత్సరం ఆఖరి పని దినం అనగా ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటి పూట బడులు వర్తించనున్నాయి. అయితే పదో తరగతి పరీక్ష కేంద్రాలుగా ఉన్న పాఠశాలల్లో పరీక్షలు జరిగే ఏడు రోజుల పాటు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్లాసులు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తిన్నాకే పిల్లలను ఇళ్లకు విడిచిపెడతామని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఒంటిపూట సందర్భంగా బడుల్లో తగినంత తాగునీరు అందుబాటులో ఉంచాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉపయోగించాలని సూచించారు.

పార్ట్ టైమ్ జాబ్.. ఫుల్ టైమ్ ఫ్రాడ్

- పార్ట్ టైమ్ జాబ్ పేరిట సైబరాసురుల వల
- అమాయకుల పేరిట బ్యాంకు ఖాతాలు, సిమ్‌లు ఓపెన్ చేసి సొమ్ము చేసుకుంటున్న వైనం



శ్రీకాకుళం క్రైమ్ :

నరసన్నపేటలో ఓ వ్యక్తి తన ఇన్‌స్టాగామ్‌లో తెలియని లింక్ రావడంతో ఓపెన్ చేశాడు. ఓ వెబ్ పేజీ ఓపెన్ అయ్యింది. పార్ట్‌టైమ్ జాబ్ చేసుకోవచ్చని చేయాల్సిందల్లా టాస్క్‌లు క్లియర్ చేయడమేనని మెయిల్‌లో రావడంతో ఓకే చేశాడు. మొదట్లో తన అకౌంట్‌లో డబ్బులు పడ్డాయి. తర్వాత రూ.7.50 లక్షల వరకు లాగేశారు. మోసపోయానని తెలుసుకున్నలోపే అంతకుముందు అతని నంబర్‌ను యాడ్ చేసిన గ్రూపు నుంచి తొలగించి బ్లాక్‌లిస్టులో పెట్టేశారు.

- శ్రీకాకుళం కేంద్రంగా టెలిగ్రామ్ యాప్‌లో ఓ యువతి పైన చెప్పిన తరహాలోనే రూ.2.80 లక్షలు మోసపోయింది. ఆమె సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావడం విశేషం.

- ఇచ్ఛాపురానికి చెందిన ఓ యువకుడు వర్క్‌ఫ్రం హోం అంటూ ఆన్‌లైన్ టాస్క్‌ల పేరిట రూ.12.50 లక్షలు అప్పు చేసి పెట్టుబడి పెట్టాడు. ఆఖరికి ఇంట్లో వాళ్లు అప్పు తీర్చాల్సి వచ్చింది.

టాస్క్ బేస్డ్ పార్ట్ టైమ్ జాబ్.. మోసగాళ్ల సరికొత్త వల. డబ్బులు సంపాదించుకోవచ్చనే ఆశ చూసి ఖాతాలు ఖాళీ చేసేందుకు వేసిన తాజా ప్రణాళిక. జిల్లాలోనూ ఈ తరహా మోసాలు వెలుగుచూస్తున్నాయి. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో తెలియని లింక్‌లు, పార్ట్‌టైం జాబ్ ఆఫర్స్ కొన్నిమార్లు వస్తుంటాయి. క్లిక్ చేశాక వెబ్‌పేజీ ఓపెన్ అవుతుంది. మనకు తెలియకుండానే అవతలి వాళ్లు మనల్ని గ్రూపులో యాడ్‌చేస్తారు. కొన్ని టాస్క్‌లు (లైక్‌లు కొట్టడం, సబ్‌స్క్రైబ్ చేయడం) మీరు గెలుచుకుంటే సొమ్ము రెట్టింపు వస్తుందని నమ్మబలుకుతారు. మొదటి టాస్క్‌లో రూ. 1000 నుంచి రూ. 2 వేలు పెట్టుబడి పెడితే దానికి డబుల్ అమౌంట్ తర్వాత టాస్క్ రూ. 10 వేలు అని ఫినిష్ చేస్తే డబుల్ అంటారు.. సక్సెస్‌గా పూర్తి చేసినా మన ఖాతాలో డబ్బులు రావు. మన పేరుతో ఓ ఫేక్ యాప్ అకౌంట్‌ను వ్యాలెట్ రూపంలో చూపించి అందులో డబ్బులు యాడ్ అయినట్లు చూపిస్తారు. మనం విత్‌డ్రా చేయడానికి అవ్వదు. మళ్లీ మూడో టాస్క్ రూ. 50 వేలు అని పూర్తి చేస్తే రూ. 1 లక్ష వస్తుందని నమ్మిస్తారు. కంప్లీట్ అయ్యాక డబ్బులు విత్‌డ్రా చేద్దామంటే అవ్వకపోవడంతో వారిని మనం అడిగితే అందులో మొదట పంపిన రూ. 10 వేలకు రూ. 10 వేలు, తర్వాత పంపిన రూ. 50 వేలకు రూ. 50 వేలు చూపించి విత్‌డ్రా ఆప్షన్ డిజేబుల్ అని చూపిస్తుందంటారు. టాస్క్‌లో మీరేదో తప్పు చేయడం వలనే ఇలా జరిగిందని అది ఎనేబుల్ చేయడానికి నాలుగో టాస్క్ చేయాలంటారు. రూ. లక్ష నుంచి రూ. 5 లక్షల వరకు ఆ టాస్క్ ఉంటుందంటారు. మనం నమ్మి ఆ డబ్బులు పంపిస్తే అక్కడికి కొద్ది క్షణాల్లోనే అకౌంట్ బ్లాక్ అయిపోయిందని మీ అకౌంట్‌లో రూ. 7 లక్షల నుంచి రూ. 8 లక్షలుందని అవి విత్‌డ్రా అవ్వాలంటే మరో రూ. 2లక్షలు, లేదా రూ. 3లక్షలు వేయాలని చెబుతారు. పైగా మనకు తెలియకుండానే వేరే బాధితుడి అకౌంట్‌కు సైతం రూ. 10 వేలు వేయించి మన చేతే ముందుగా ఫ్రాడ్ చేయించి ఉంటారు. డబ్బులు వేశాక గ్రూపు నుంచి రిమూవ్ చేసి నంబర్లు బ్లాక్ చేస్తారు.



కాంబోడియా, చైనాలో..



ఈ తరహా మోసాలకు పాల్పడేవాళ్లు కాంబోడియా, చైనాలోనే ఉంటారని సైబర్ నిపుణులంటున్నారు. ఇక్కడి మధ్య వర్తులు అమాయక ప్రజల చేత బ్యాంకు ఖాతాలు తెరిపించి, వారి పేరుతోనే ఫోన్ సిమ్‌లు కొనిపించి మోసపోయిన బాధితుల సొమ్మును వీరి ఖాతాలో పడేటట్లు చేసి తర్వాత అనేక ఖాతాలు మార్చి చివరికి వారికెళ్లేలా చేస్తారు. ఇదంతా ఓ లింక్ సిస్టమ్ మాదిరిగా జరు గుతుంది. ఇప్పటివరకు ఎన్నో సైబర్ కేసుల్లో మన జిల్లా పోలీసులు పక్క రాష్ట్రాల వరకు వెళ్లారు. బ్యాంకు ఖాతా చిరునామా ఉన్నవారికి, నడిపిన మధ్యవర్తులకు నోటీసులిచ్చారు. కొందరు ఇక్కడి కోర్టులకు సైతం వచ్చారు. కానీ మోసం చేసే కేటుగాళ్లు మాత్రం విదేశాల్లో దాక్కుని ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

తెలియని లింక్‌లు క్లిక్ చేయకూడదు. స్పామ్ కాల్స్, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్ లిఫ్ట్ చేయొద్దు. టాస్క్‌బేస్డ్ ఆఫర్స్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సైబర్ నేరాలను అరికట్టేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వ్యూహాత్మకంగా కొన్ని నిర్ణయాలను తీసుకుంటున్నాయి. జిల్లాకు సైబర్ పోలీస్ స్టేషన్ అందుబాటులోకి వస్తుంది.

– కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం

విశృంఖలంగా బెల్ట్ బాదుడు

- జడలు విప్పిన లిక్కర్ సిండికేట్
- పుట్టగొడుగుల్లా వెలిసిన బెల్ట్‌షాపులు
- నాలుగైదు మండలాల్లో మినహా జిల్లా వ్యాప్తంగా అడ్డగోలు విక్రయాలు
- బెల్ట్‌షాపులకు సరఫరా చేస్తున్నందుకు క్వార్టర్ బాటిల్‌కు అదనంగా రూ. 10 వసూలు
- పలాస నియోజకవర్గంలోనైతే లైసెన్సు దుకాణాల కౌంటర్లలో క్వార్టర్ బాటిల్‌పై రూ. 10 పెంచి విక్రయాలు
- దోపిడీకి కీలక నేతల అండ



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లాలో మద్యం మాఫియా జడలు విప్పింది. లిక్కర్ సిండికేట్ వ్యవహారం మూడు క్వార్టర్లు.. ఆరు ఫుల్‌బాటిళ్లుగా వర్ధిల్లుతోంది. జిల్లావ్యాప్తంగా లెక్కకు మించి బెల్టు దుకాణాలు తెరిచారు. ఎమ్మార్పీకి మించి మద్యం ధరలు పెంచేసి అడ్డగోలుగా దోచుకుంటున్నారు. ఈ దోపిడీకి అండగా నిలిచినందుకు ప్రజాప్రతినిధులకు భారీగా ముడుపులు అందుతున్నాయి. కొన్నిచోట్ల షాపుకి నెలకు రూ.50 వేలు చొప్పున, మరికొన్ని చోట్ల అక్కడున్న అమ్మకాల దృష్ట్యా రూ.30వేల నుంచి రూ.70వేల వరకు తీసుకుంటున్నారు. పనిలో పనిగా అధికార వర్గాలు కూడా రెన్యువల్ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాయి. జనవరిలో జరిగిన రెండో రెన్యువల్‌కు షాపునకు రూ. 70 వేలు వసూలు చేయగా, ఈ నెలలో చేయాల్సిన మూడో రెన్యువల్‌కు రూ.30వేలు అడుగుతున్నాయి.

రూ.10 అదనం



జిల్లాలో బెల్ట్‌షాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. అన్నీ నేతల కనుసన్నల్లోనే ప్రారంభమయ్యాయి. తమ టర్నోవర్ పెరగడం కోసం లైసెన్స్ దుకాణాలు బెల్ట్‌షాపులను ప్రోత్సహిస్తున్నాయి. ఒక్కో గ్రామానికి కనీసం 10 బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. ఈ బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేసే బాధ్యతను లైసెన్సు దుకాణాలు తీసుకుంటున్నాయి. ఒక్కో క్వార్టర్ బాటిల్‌కు రూ.10 పెంచి తీసుకోగా, ఆ బెల్ట్ షాపుల నిర్వాహకులు మరో రూ.40వేసి రూ. 50 అధికంగా విక్రయిస్తున్నారు. ప్రస్తుతానికి శ్రీకాకుళం టౌన్, శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల, ఇచ్ఛాపురంలో మినహా మిగతా అన్ని చోట్ల బెల్ట్‌షాపులకు ఒక్కో బాటిల్‌పై రూ. 10 పెంచి సరఫరా చేస్తున్నారు.

పలాస నియోజకవర్గంలో బరితెగింపు

పలాస నియోజకవర్గంలోనైతే మద్యం దుకాణాల కౌంటర్‌లో క్వార్టర్ బాటిల్‌కు రూ.10 అదనంగా వేసి విక్రయిస్తున్నారు. ఆ మధ్య జామి జాతరలోనైతే ఒక్కో బాటిల్‌కు రూ. 50 పెంచి విక్రయించారు. వాస్తవానికి జాతర సమయంలో దుకాణాలు తెరవకూడదు. కానీ బ్యాక్‌డోర్‌లో మొత్తం తతంగం నడిపేశారు. కీలక నేతల అనుమతి తీసుకుని దర్జాగా షాపుల కౌంటర్లలోనే ఎమ్మార్పీకి రూ.10 పెంచి విక్రయించేస్తున్నారు. ఎవరికెంత ముడుపులందుతున్నాయో గానీ ఎమ్మార్పీకి మించి విక్రయాలకు గేట్లు ఎత్తేశారు.

కీలక నేతలకు ముడుపులు



- జిల్లాలో జరుగుతున్న మద్యం దోపిడీపై కీలక నేత ముడుపుల ఒప్పందం కుదుర్చుకున్నారు.
- కొన్ని నియోజకవర్గాల్లో షాపుకి నెలకు రూ. 50 వేలు చొప్పున, మరికొన్ని నియోజకవర్గాల్లో షాపు సామర్థ్యం మేరకు రూ.30వేల నుంచి రూ. 70వేలు ఇచ్చేందుకు నిర్ణయాలు జరిగిపోయాయి.
- ఇప్పటికే కొన్నిచోట్ల చెల్లింపులు జరిగిపోగా, మరికొన్ని చోట్ల వారం పది రోజుల్లో ఆ మేరకు చెల్లింపులు చేయడానికి సిండికేట్ సిద్ధం చేసింది.
- ఇక,లైసెన్సు షాపుల కౌంటర్లలోనే క్వార్టర్ బాటిల్‌కు రూ.10 పెంచి విక్రయిస్తున్న చోట ఈ ముడుపులు మరింత ఎక్కువగా ఉన్నాయి.
- నెలకి రూ. లక్షకు పైగా ముట్టజెబుతున్న షాపులు కూడా ఉన్నాయి.
- శ్రీకాకుళం టౌన్, శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల, ఇచ్ఛాపురంలో విక్రయాలకు చర్చలు జరుగుతున్నాయి.
- దీనికి తోడు సిండికేటైన చోట వ్యాపారం టర్నోవర్ చూసి ఈ ముడుపులు పెంచే అవకాశం కూడా ఉంది.
- ముఖ్యంగా ప్రభుత్వం 20 శాతాలు లాభాలు ఇస్తే ఈ ముడుపులు మరింత పెరగనున్నాయి.
- తక్కువ ధరలకు నాణ్యమైన మద్యం అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దశలవారీగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ధరలు పెంచేసి మందుబాబులను దోచుకుంటోంది.

తిలాపాపం తలా పిడికెడు

మద్యం దోపిడీలో నేతలు లాభాలు ఆర్జిస్తుంటే.. తామెందుకు వదులుకోవాలని అధికార వర్గాలు సైతం అక్రమ వసూళ్లు చేస్తున్నాయి. కాకపోతే, లైసెన్సుల రెన్యువల్ పేరుతో వసూళ్లు చేస్తున్నాయి. జనవరిలో జరిగిన రెండో రెన్యువల్‌కు షాపుకి రూ. 70వేలు వసూలు చేయగా, ఈ నెలలో జరిగే మూడో రెన్యువల్‌కు ఇప్పటికే రూ. 30వేలు డిమాండ్ చేస్తున్నాయి. శాంతిభద్రతలు, మందుబాబుల రాకపోకలు తదితర వ్యవహారాలను కంట్రోల్ చేసేందుకు సంబంధిత అధికారులు షాపుకింత అని నెలవారీ ముడుపులు ఇప్పటికే తీసుకుంటున్నారు.

క్లుప్తంగా

హాల్‌టికెట్ల పేరిట విద్యార్థులను వేధించొద్దు

శ్రీకాకుళం అర్బన్: ఈ నెల 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్షల హాల్ టికెట్ల జారీలో ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయన్న నెపంతో జిల్లాలో పలు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు హాల్ టికెట్లలో స్కూల్ ప్రిన్సిపాల్ సంతకాలు, స్టాంపులు ఉండాల్సిందేనన్న నిబంధనలు పెట్టి విద్యార్థులను మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమయంలో ఫీజుల కోసం ఒత్తిడి చేయడం సమంజసం కాదని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పలు సూచనలు జారీ చేసిందని గుర్తు చేశారు. ఎక్కడైనా హాల్ టికెట్ల జారీ పేరుతో యాజమాన్యాలు గందరగోళ పరిస్థితులు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

తుప్పల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


వ్యక్తి మృతదేహం

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని జరజాం రోడ్డు పక్కన తుప్పల్లో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న ఎస్సై నక్క కృష్ణారావు, పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 30 ఉండవచ్చని భావిస్తున్నారు. ఇతను కొంతకాలంగా ఈ ప్రాంతంలోనే తిరిగే వాడని స్థానికులు చెబుతున్నారు. అనారోగ్యం, ఆకలి వంటి సమస్యలతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని పోలీసులు సూచించారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసిన వారు 08942-281833, 63099 90853 నంబర్లకు సమాచారం తెలియజేయాలని కోరారు.

లారీని ఢీకొట్టిన కారు

- ఇద్దరు మహిళలకు గాయాలు


ప్రమాదంలో నుజ్జయిన కారు

నరసన్నపేట: జమ్ము ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలికి చెందిన పి.సునీత, పి.పద్మలకు తీవ్ర గాయాలయ్యాయి. ముందు వెళ్తున్న లారీని వెనకనుంచి కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కారు డ్రైవరు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కారు ముందు భాగం పూర్తిగా నుజ్జయ్యింది. తాపీమేస్త్రీ పి.గణపతి కాలికి గాయం కావడంతో శ్రీకాకుళంలో చికిత్స చేసిన అనంతరం తిరిగి ఇంటికి కారులో వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. సమాచారం తెలుసుకున్న ఎన్‌హెచ్ అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

ఫీడర్ అంబులెన్సులో ప్రసవం


బిడ్డతో సునీత బెహరా

కంచిలి: మండలంలోని కుంబరినొగాం గ్రామానికి చెందిన సునీత బెహరా అనే గర్భిణికి గురువారం మధ్యాహ్నం పురిటి నొప్పులు వచ్చాయి. సమాచారం అందుకున్న ఎం.ఎస్.పల్లి పీహెచ్‌సి ఫీడర్ అంబులెన్స్ ఈఎంటీ అజయ్ వెంటనే గ్రామానికి వెళ్లారు. ఫీడర్ అంబులెన్సులో సునీతను తీసుకొస్తుండగా నొప్పులు ఎక్కువ కావడంతో మార్గమధ్యలోనే ప్రసవం చేయించడంతో మగబిడ్డ జన్మించాడు. అనంతరం తల్లీబిడ్డలను ఆస్పత్రికి తరలించారు. సమయస్ఫూర్తితో స్పందించిన ఈఎంటీ అజయ్‌ను గ్రామస్తులు అభినందించారు.

మానవ అక్రమ రవాణా నిరోధించాలి


సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీ వ్యవస్థను సమూలంగా నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని న్యాయసేవా సదన్‌లో పోక్సో చట్టం, వెట్టి చాకిరి నిర్మూలన, మానవ అక్రమ రవాణా నిషేధ చట్టంపై స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, మున్సిపల్ కమిషనర్ పి.వి.ఆర్.పి.ప్రసాదరావు, డిప్యూటీ లేబర్ కమిషనర్ కె.అజయ్ కార్తికేయ, డిప్యూటీ డైరెక్టర్ విశ్వమోహన్ రెడ్డి, బాలల సంక్షేమ అధికారులు శ్రీలక్ష్మి, కె.వి.రమణ పాల్గొన్నారు.

ప్రత్యేకం.. పంచకర్మ వైద్యం

ఆయుర్వేదంలో అత్యంత ప్రసిద్ధమైన, పురాతనమైన ప్రక్రియ పంచకర్మ చికిత్స. పంచకర్మ అంటే 'ఐదు చర్యలు' అని అర్థం. శరీరాన్ని నియంత్రించే వామన, విరేచన, వస్తి, నస్య, రక్తమోక్షణ అనే ఐదు విలక్షణమైన ప్రాథమిక కార్యకలాపాలపై ఈ వైద్యం ఆధారపడి ఉంటుంది. మానసిక, శారీరక సమస్యలతో పాటు శరీరంలో మలినాలను తొలగించడానికి అద్భుత ఆయుర్వేద చికిత్సగా పంచకర్మను చెప్పవచ్చు. మన జిల్లాలో ఒక్క కోటబొమ్మాళి ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో మాత్రమే ఈ వైద్యం అందుబాటులో ఉంది.


పంచకర్మ చికిత్స అందుబాటులో ఉన్న కోటబొమ్మాళి ఆయుర్వేద ఆసుపత్రి

- కోటబొమ్మాళి ఆయుర్వేద ఆస్పత్రిలో అందుబాటులో చికిత్సలు
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఉపయోగకరం
- రాష్ట్రంలో 13 ఆస్పత్రుల్లోనే ఈ రకమైన వైద్యసేవలు

టెక్కలి:

మారుతున్న కాలంతో పాటు విస్తరిస్తున్న వివిధ రకాల అనారోగ్య సమస్యల పరిష్కారానికి ఎంతో మంది ఆయుర్వేద వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. కేరళ వంటి రాష్ట్రాల్లో దీనికి ఎక్కువ ఆదరణ ఉంది. ఆయుర్వేద వైద్యం అందరికీ అందుబాటులో ఉండాలనే ఆలోచనతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2023లో కేంద్ర ఆయుష్ విభాగం జిల్లాలో కోటబొమ్మాళి ఆయుర్వేద ఆసుపత్రిలో 'పంచకర్మ చికిత్స'ను అందుబాటులోకి


కోటబొమ్మాళి ఆయుర్వేదిక్ ఆసుపత్రిలో పంచకర్మ వైద్య విభాగం


పంచకర్మ వైద్యానికి వినియోగించే పద్ధతులను చూపుతున్న డాక్టర్ వివేకానంద

తీసుకొచ్చింది. కీళ్ల నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు, గ్యాస్ట్రిక్, చర్మవ్యాధులు, మూలవ్యాధులు, నరాల సమస్యలు, సయాటికా, మైగ్రేన్, వెన్నెముక సంబంధించిన అనారోగ్య సమస్యలకు ఈ పంచకర్మ వైద్యాన్ని వినియోగిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 ఆయుర్వేద ఆసుపత్రులలో ఈ పంచకర్మ వైద్య సేవలు ఉండగా, అందులో కోటబొమ్మాళి ఆయుర్వేద ఆసుపత్రి ఒకటి కావడం విశేషం. డాక్టర్ వివేకానంద ఆధ్వర్యంలో పంచకర్మ చికిత్సలతో పాటు ఆయుర్వేదిక్ మొక్కలతో హెర్బల్ గార్డెన్ పెంచుతున్నారు.

బహుళ ప్రయోజనాలు...

శరీరాన్ని పూర్తిగా శుభ్రపరచడం, విష పదార్థాల విసర్జన చేయడం, జీవక్రియను వేగవంతం చేయడం, బరువు తగ్గడం, జీర్ణ అగ్ని బలాన్ని పెంచడం, మానసిక, శారీరక విశ్రాంతి, కణజాలాల పునరుజ్జీవనంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచడం, ఒత్తిడిని తగ్గించడంలో ఈ వైద్యం ఎంతగానో ఉపయోగపడుతుంది.

పంచకర్మ దశలు..



వామన కర్మ: కఫాన్ని సమతుల్యం చేయడంలో సహాయపడటానికి ప్రేరేపిత వాంతులు ఉంటాయి. దీని ద్వారా శ్వాసకోశ వ్యాధులు, చర్మ వ్యాధులను నిరోధిస్తారు.

విరేచన కర్మ: జీర్ణ సమస్యలను నియంత్రించడానికి ఈ ప్రక్రియ ఉపయోగిస్తారు. కడుపులో పేరుకుపోయిన విషాన్ని శుభ్రపరచడంలో సహాయపడుతుంది.

వస్తి కర్మ: వాతాన్ని సమతుల్యం చేయటానికి సూచించిన నూనెలు, కషాయాలను యానో రెక్టల్ మార్గం ద్వారా వైద్యం చేస్తారు.

నశ్య కర్మ: నాసికా రంధ్రం ద్వారా వైద్యం అందజేస్తారు. మైగ్రేన్ సమస్యలను తగ్గించడానికి ఈ ప్రక్రియ ఉపయోగిస్తారు.

రక్తమోక్షణ కర్మ: శరీరంలో ఉన్న అపరిశుభ్రమైన రక్తాన్ని తొలగించడానికి ఈ ప్రక్రియను వినియోగిస్తారు. కొన్ని రకాల పరికరాలతో ఈ వైద్యం చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి...



కోటబొమ్మాళి ఆయుర్వేద ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న పంచకర్మ చికిత్సను అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలి. చికిత్సతో పాటు మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. ఇక్కడే ఆయుర్వేద మొక్కలను పెంచుతున్నాం. కీళ్ల నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు, గ్యాస్ట్రిక్, చర్మవ్యాధులు, మూలవ్యాధులు, నరాల సమస్యలు, సయాటికా, మైగ్రేన్, వెన్నెముక సంబంధిత సమస్యలకు వైద్యం అందజేస్తాం.

–డాక్టర్ కె.వివేకానంద, ఎండీ, ఆయుర్వేదిక్, కోటబొమ్మాళి

సెమిస్టర్ పరీక్షల్లో చూసిరాత'లా'!

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మూడేళ్ల ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ సెమిస్టర్ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం వేళల్లో నిర్వహిస్తున్నారు. ఇందులో చూసిరాతలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నెల 11న ప్రారంభమైన పరీక్షలు ఈ నెల 22 వరకు కొనసాగనున్నాయి. 1, 3, 5, 7, 9 సెమిస్టర్లకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల, శ్రీకాకుళం పట్టణంలోని ఓ ప్రైవేట్ న్యాయ కళాశాలకు చెందిన 250 మంది వరకు విద్యార్థులు హాజరవుతున్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించడం వల్ల గూగుల్, వాట్సాప్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆస్క్ మేటా ఏ–1ల ద్వారా చూసిరాతలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై రెక్టార్, చీఫ్ సూపరింటెండెంట్ అడ్డయ్య వద్ద ప్రస్తావించగా పూర్తిస్థాయి నిఘా మధ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పరీక్ష కేంద్రం పరిశీలన


పరీక్ష కేంద్రంలో అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఎల్ఎల్‌బీ మూడేళ్లు, ఐదేళ్ల కోర్సుల సెమిస్టర్ పరీక్షలను గురువారం రెక్టార్ అడ్డయ్య, పరీక్షల నిర్వహణ డీన్ ఉదయ్‌భాస్కర్, ప్రత్యేకాధికారి సామ్రాజ్యలక్ష్మి పరీక్షలు పరిశీలించారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా అప్రమత్తంగా ఉండాలని ఇన్విజిలేటర్లకు సూచించారు.

21 నుంచి జాతీయ ఆహ్వాన నాటిక పోటీలు


మాట్లాడుతున్న సుమిత్రా కళాసమితి సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా ఈ నెల 21 నుంచి 23 వరకు హనుమంతు చిన్నరాములు స్మారక జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సుమిత్రా కళా సమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని వాసవీ కల్యాణ మండపంలో గురువారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న కళలను ఆదరించి, వాటిని భావితరాలకు అందించే ప్రయత్నంలో భాగంగా ఈ ఏడాది కూడా ప్రపంచ రంగస్థల కళాకారుల దినోత్సవం పురస్కరించుకొని జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహించేందుకు సిద్ధమైనట్లు చెప్పారు. 21న షిరిడిసాయి వెల్ఫేర్ అసోసియేషన్(అనకాపల్లి) 'ఆశ కదరా శివ', 22న చైతన్య కళాభారతి(కరీంనగర్) 'స్వప్నం రాల్చిన అమృతం', మణికంఠ ఆర్ట్స్(పిఠాపురం) 'కొత్త తరం కొడుకులు', ఉషోదయా కళానికేతన్(కట్రపాడు) 'కిడ్నాప్', 23న అరవింద్ ఆర్ట్స్ (తాడేపల్లి) 'అసత్యం' నాటిక ప్రదర్శనలు జరుగుతాయని వివరించారు. ప్రముఖ సినీ, టీవీ, హాస్యనటులు అప్పారావు ఆధ్వర్యంలో హాస్య వల్లరి ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. సమావేశంలో సమితి కార్యదర్శి గుత్తు చిన్నారావు, కోశాధికారి నక్క శంకరరావు, ఉపాధ్యక్షులు మండవిల్లి రవి, కిల్లాన ఫల్గుణరావు, మెట్ట పోలినాయుడు, కొమనాపల్లి సురేష్, కొంక్యాన మురళీధర్, పార్థసారధి, వరలక్ష్మీ, ఉషారాణి, యు.పూజ, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్యాస్ కష్టాలు

- పొందూరులో ఏజెన్సీ మార్చినా ఇళ్ల వద్దకు సరఫరా కాని వైనం
- ఇబ్బందుల్లో లబ్ధిదారులు


గ్యాస్ గొడౌన్ వద్దకు వెళ్లి సిలిండర్ తీసుకుంటున్న కస్టమర్లు

పొందూరు: మండల కేంద్రం పొందూరులో ఇండేన్ గ్యాస్ లబ్ధిదారులకు గ్యాస్ కష్టాలు తప్పడం లేదు. గ్యాస్ ఏజెన్సీని మార్చినా వినియోగదారుల ఇళ్లకు సిలిండర్లు చేరడం లేదు. పొందూరు, జి.సిగడాం, లావేరు, సంతకవిటి, ఎచ్చెర్ల మండలాల్లోని పలు పంచాయతీలకు పొందూరు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీయే ఆధారం. ఆయా పంచాయతీల్లో సుమారు 28 వేలు గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. పొందూరు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీకి సుమారు 25 కిలోమీటర్ల పరిధి వరకు కస్టమర్లు ఉన్నారు. వారందరూ పొందూరు ఏజెన్సీకి వచ్చి గ్యాస్ తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

డోర్ డెలివరీ అయ్యేనా...



ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారులు, కూలీలు ఆదరాబాదరగా తమ విధి నిర్వహణలకు పరుగులు తీస్తున్నారు. సొంత పనులు చేసుకునేందుకు సైతం సమయం ఉండటం లేదు. ఈ క్రమంలో గ్యాస్ కష్టాలు మరింతగా వెంటాడుతున్నాయి. ఈ నెల 1 నుంచి 10 వరకు గ్యాస్ సిలిండర్లు సరఫరా కాక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 11వ తేదీ నుంచి సరఫరా చేస్తున్నా గోదాము వద్దకు వెళ్లాల్సి వస్తోందని, ఇళ్లకు తెచ్చి ఇవ్వడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. ఈ విషయమై ప్రస్తుత వజ్రపుకొత్తూరు ఏజెన్సీ సిబ్బంది వద్ద ప్రస్తావించగా రెండు రోజుల్లో డోర్ డెలివరీ ప్రారంభిస్తామని చెప్పారు.

కిడ్నీ సమస్యతో యువకుడి మృతి

- కిడ్నీ దినోత్సవం నాడు విషాదం


భాస్కర్(ఫైల్)

టెక్కలి రూరల్: ప్రపంచ కిడ్నీ దినోత్సవం నాడే టెక్కలిలో డయాలసిస్ సేవలు పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. శ్రీనివాస నగర్‌కు చెందిన ఎస్.భాస్కర్(30) కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. గురువారం తీవ్ర అస్వస్థత రావడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆసుపత్రిలో ఉన్న డయాలసిస్ కేంద్రానికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అత్యవసర విభాగానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ భాస్కర్ మృతి చెందాడు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం నాడు కిడ్నీ వ్యాధితో యువకుడు మృతి చెందడం బాధాకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇసుక ర్యాంపులో తనిఖీలు


పురుషోత్తపురం ఇసుక ర్యాంపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

సరుబుజ్జిలి: పురుషోత్తపురం 1, 2 ఇసుక ర్యాంపుల్లో టెక్కలి గనుల శాఖ ఏడీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఇటీవల కలెక్టర్ గ్రీవెన్స్‌కు వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ ఆమదాలవలస నియోజకవర్గం ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ ఇసుక ర్యాంపుపై ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాలు మేరకు టెక్కలి గనుల శాఖ అధికారులు ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు చేపట్టారు. ఇసుక ర్యాంపు నిర్వహణ ఎంత విస్తీర్ణం మేరకు నిర్వహించారు, తవ్వకాలు ఎంత లోతులో చేపడుతున్నారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ర్యాంపు తీరం వరకు మైన్స్ అధికారులు బొలేరో వాహనం ద్వారా వెళ్లి తనిఖీ చేశారు. ర్యాంపులో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ర్యాంపులో సీసీ కెమెరాలు ఉండాలని, ఇసుక రవాణా చేస్తున్న ప్రతి వాహనానికి బ్యానర్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. తవ్వకాలు జరిగే ప్రదేశం వద్దకు వెళ్లకుండా అక్కడ ఉన్న కొంతమంది వద్ద నుంచి వివరాలు సేకరించి వెనుదిరిగారు. మైన్స్ అధికారులు ర్యాంపు వద్దకు తనిఖీలు కోసం వచ్చే సమయంలో మండల స్థాయి అధికారులు ఎవ్వరూ లేకపోవడం గమనించదగ్గ విషయం.

వేర్వేరు చోట్ల 8 కేజీల గంజాయి సీజ్


మందస: పట్టుబడిన నిందితుడితో పోలీసులు

మందస: గంజాయి అక్రమ రవాణాను అడ్డుకున్నట్లు డీఎస్పీ వెంకట అప్పారావు తెలిపారు. కాశీబుగ్గ రూరల్ సీఐ ఎం.తిరుపతిరావు, మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్‌తో కలిసి గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన రాహుల్ మండల్ తమిళనాడు రాష్ట్రం ఈరోడ్ పట్టణంలో టైలర్‌గా పనిచేస్తున్నాడు. అక్కడ రంజిత్ అనే గంజాయి వ్యాపారితో పరిచయం పెంచుకున్నాడు. అతని సూచన మేరకు ఒడిశా రాష్ట్రం పారదీప్ వెళ్లి భానోజీ అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి మందస రాగా రైల్వేస్టేషన్ వద్ద ఎస్ఐ కృష్ణప్రసాద్ నేతృత్వంలోని పోలీసుల బృందం పట్టుకున్నారు. రాహుల్ వద్ద 4 కేజిల 132 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. నిందితుడిని సోంపేట కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

ప్రైవేటు వాహనంలో తరలిస్తూ..


నరసన్నపేట: వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

నరసన్నపేట: పోలీసులు నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో భాగంగా ఒడిశా రాష్ట్రం భద్రక్ జిల్లా పడిసాయి గ్రామానికి చెందిన షేక్ గుల్ఫాన్ నాలుగు కేజీల గంజాయితో గురువారం పట్టుబడ్డాడు. హైదరాబాద్ వెళ్తున్న ఓ ప్రయివేటు వాహనాన్ని అనుమానంతో దేవాది వద్ద తనిఖీ చేయగా గంజాయి పట్టుబడిందని నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు తెలిపారు. ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు.

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ఫస్టియర్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. జిల్లాలో 75 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఈ పరీక్షల్లో కెమిస్ట్రీ, కామర్స్ పేపర్లకు పరీక్ష రాశారు. జనరల్, ఒకేషనల్ కలిపి 20,317 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 696 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. స్వల్ప కేంద్రాల్లో మాత్రమే ఈ నెల 19వ తేదీ వరకు బ్రిడ్జ్ కోర్సుల పేపర్లకు పరీక్షలు జరుగుతాయి.

డీఎస్సీ కోచింగ్‌కు అప్లికేషన్ల ఎంపిక

శ్రీకాకుళం పాతబస్టాండ్ : ఎస్సీ,ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు సంబంధించి కోచింగ్ సెంటర్లను ఈ నెల 15లోగా ఎంపిక చేసుకోవాలని డీడీ విశ్వమోహన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

సకాలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారం

- డివిజన్ అధికారుల సమీక్షలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్


సమీక్షలో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

టెక్కలి: జిల్లాలో రెవెన్యూ శాఖకు సంబంధించి ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా తక్షణమే పరిష్కార మార్గం చూపాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. శ్రీకాకుళం, టెక్కలి, పలాస డివిజన్ల పరిధిలోని రెవెన్యూ శాఖలో వివిధ విభాగాల అధికారులతో గురువారం టెక్కలిలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా పీజీఆర్ఎస్‌కు వస్తున్న రెవెన్యూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ప్రతి అర్జీపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి పరిష్కార మార్గం చూపాలన్నారు. రీసర్వేకు సంబంధించి పైలట్ గ్రామాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ల్యాండ్ బ్యాంకింగ్ ప్రక్రియను సమర్థంగా చేపట్టాలన్నారు. కోర్టు వివాదాలు భూవ్యవహారాల్లో చిత్తశుద్ధిగా వ్యవహరించాలన్నారు. అనంతరం రీసర్వేపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వరరావు, ఆర్డీఓలు ఎం.కృష్ణమూర్తి, సాయిప్రత్యూష, జి.వెంకటేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, ల్యాండ్ సర్వే విభాగం ఏడీ విజయకుమార్, తహసీల్దార్లు, డీటీలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సర్వేయర్లు, వీఆర్‌ఓ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా


సిబ్బందికి సూచనలిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

ఇచ్ఛాపురం: ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని చెక్‌పోస్టుల వద్ద నిషేధిత పదార్థాలైన గంజాయి, సారా, మద్యం అక్రమ రవాణ జరగకుండా నిరంతరం నిఘా పెట్టాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. పురుషోత్తపురం చెక్‌పోస్టు, ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సారా అమ్మకాల కట్టడికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవోదయం–2, అక్రమ మద్యం 14405 టోల్ ఫ్రీ నంబర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు మందు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి సీహెచ్ తిరుపతి, సీఐ పి.డి.ప్రసాద్, పెట్రోలింగ్ ఎస్సై జి.బి.రమణ పాల్గొన్నారు.

దగ్గరకొచ్చారో దూకేస్తా..!

- రిమ్స్‌లో మద్యం మత్తులో రోగి ఆత్మహత్యాయత్నం
- భవనం పైనుంచి దూకేందుకు ప్రయత్నం
- కాపాడిన సెక్యూరిటీ సిబ్బంది, కార్మికులు


బాధితుడిని పట్టుకుంటున్న సిబ్బంది (ఇన్‌సెట్లో) దూకేస్తానంటూ బెదిరిస్తున్న వరహా నర్సింహం

శ్రీకాకుళం: మద్యం తాగేందుకు డబ్బుల కోసం ఫోన్ చేస్తే కుటుంబ సభ్యులు లిఫ్ట్ చేయకపోవడంతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రిమ్స్ ఆస్పత్రి భవనం మూడో అంతస్తు పైనుంచి దూకేందుకు ప్రయత్నించాడు. అయితే సకాలంలో ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది గమనించి కాపాడారు. రిమ్స్ సిబ్బంది, రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సరుబుజ్జిలి మండలం నక్కలపేట గ్రామానికి చెందిన సనపల వరహానర్సింహం అనే వ్యక్తి మద్యానికి బానిసయ్యాడు. మద్యం మాన్పించేందుకు కుటుంబ సభ్యులు రిమ్స్‌లో చేర్పించారు. అక్కడి ఎస్ఎం వార్డులో ఉండి చికిత్స పొందుతున్నాడు. గురువారం సాయంత్రం ఐదు గంటల సమయంలో భవనంలోని మూడో అంతస్థుకు చేరిన వరహానర్సింహం ప్రహరీ గోడపై కూర్చున్నాడు. అతన్ని వారించగా కిందకి దూకే ప్రయత్నం చేయబోయాడు. సెక్యూరిటీ సిబ్బంది, అక్కడే పనిచేస్తున్న తాపీమేస్త్రీలు, కార్మికులు చాకచక్యంగా పట్టుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. సిబ్బంది పట్టుకుని పైకి తీసే క్రమంలో సుమారు 20 నిమిషాల పాటు ఆ వ్యక్తి గాలిలోనే వేలాడుతూ ఉన్నాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు, వైద్యులు, స్థానికులు చెబుతున్నారు. మద్యం తాగేందుకు తన వద్ద డబ్బులు లేవని కుటుంబ సభ్యులకు ఫోన్ చేస్తే వారు ఫోన్ లిఫ్ట్ చేయకపోవటం వల్లే తాను ఆత్మహత్యకు ప్రయత్నించానని రిమ్స్ అధికారులకు చెప్పాడు. కాగా, వరహా నర్సింహం ఇన్‌పేషెంట్ కాదని ఆస్పత్రి సూపరెండెంట్ డాక్టర్ షకీల చెపుతుండగా.. ఎస్ఎం వార్డులో చికిత్స పొందుతున్నారని రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు.